

సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో సంభవించిన అగ్నిప్రమాదం (ఫైల్)

- ‘ఉత్తర’లో అగ్నిమాపక కేంద్రం లేక అవస్థలు
- కొండవాలు ప్రాంతాల్లో అగ్నిప్రమాద ఘటనలు
- అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు
- సకాలంలో అందని ఫైరింజన్ సేవలు
- సీతమ్మధార కేంద్రంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

అగ్ని ప్రమాదాలతో భయం.. భయం..



దక్షిణ నియోజకవర్గ పరిధి సూర్యాబాగ్‌లోని అగ్నిమాపక కేంద్రం

సీతమ్మధార: నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం లేక నిరుపేద ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సీతమ్మధారలో గల ఆర్ అండ్ బీ క్వార్టర్స్ ప్రాంతంలో ఐదేళ్ల క్రితం వరకు అగ్నిమాపక కేంద్రం ఉండేది. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే సకాలంలో అగ్నిమాపక శకటం వస్తుందన్న భరోసా ఉండేది. కాని కాలక్రమంలో ఈ అగ్నిమాపక కేంద్రాన్ని విశాఖ దక్షిణ నియోజకవర్గంలో గల సూర్యాబాగ్‌లోని అగ్నిమాపక కేంద్రంలో విలీనం చేసేసారు. బిలాల్ కాలనీ, ఏఎస్‌ఆర్ నగర్, కంచరపాలెం కొండ ప్రాంతం, తాటిచెట్లపాలెం కొండ ప్రాంతం తదితర చోట్ల నిరుపేద ప్రజలు గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. తూర్పు నియోజకవర్గంలోని సింహాద్రిపురం, హెచ్‌బీ కాలనీ కొండ ప్రాంతాల్లో గల కూడా స్వల్ప సంఖ్యలో గుడిసెలు వున్నాయి. ఇక నివాసాలు, షాపింగ్ కాంప్లెక్సులలో అడపా దడపా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతుంటాయి. దీంతో సమీపంలో ఎక్కడా అగ్నిమాపక కేంద్రం లేక దక్షిణ నియోజకవర్గంలో గల సూర్యాబాగ్ అగ్నిమాపక కేంద్రం నుంచి శకటం వచ్చేలోగా ఆస్తి కాస్త బూడిద అవుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

దూరాభారం..

సీతమ్మధార తదితర ప్రాంతాలకు సూర్యాబాగ్ ఐదు కిలోమీటర్ల పైమాటే. దీంతో అగ్నిమాపక శకటాలు నగరంలో రోజురోజుకీ పెరిగిపోతున్న ట్రాఫిక్, సిగ్నల్స్‌ను దాటుకుని వచ్చేసరికి సర్వం బూడిద కాక తప్పని దుస్థితి నెలకొంటుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అగ్నిమాపక శకటం సిబ్బంది కూడా ఇక్కడికి దూరాభారం అవుతోందని వాపోతున్నారు. గతంలో ఆర్ అండ్ బీ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఉండడడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా వెంటనే అగ్నిమాపక శకటం వచ్చేదని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఉత్తర నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేసవిలో ప్రమాదాల బెడద

సాధారణంగా వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో ఒక బాలుడు బాణసంచా కాల్చడంతో ఫ్లాట్‌లో మంటలు చెలరేగి ఆస్తినష్టం సంభవించడం తెలిసిందే. అలాగే అక్కయ్యపాలెంలో మోటార్ షోరూంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి పలు మోటార్ వాహనాలు కాలిపోవడం కూడా విదితమే. సీతమ్మధార, అక్కయ్యపాలెం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, సత్యం జంక్షన్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, ఎంవీపీ కాలనీ, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు కాలక్రమంలో బాగా పెరిగాయనే చెప్పాలి. ఇంకా షాపింగ్ కాంప్లెక్సులు, బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కూడా బహుళ అంతస్తుల భవనాల్లోనే ఏర్పాటు చేశారు.

అగ్నిమాపక కేంద్రం అవసరం

దక్షిణ నియోజకవర్గంలోని అగ్నిమాపక కేంద్రం నుంచి శకటం వచ్చేలోగా ప్రమాద తీవ్రత ఇంకా పెరుగుతుంది. కాబట్టి, ఉత్తర నియోజకవర్గంలో కూడా విధిగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.

– మహేష్, సీతమ్మధార.

విలీనం చేయటం అన్యాయం..

గతంలో సీతమ్మధార దరి ఆర్ అండ్ బీ ప్రాంతంలో ఉన్న అగ్నిమాపక కేంద్రాన్ని దక్షిణ నియోజకవర్గం కేంద్రంలో విలీనం చేయడం అన్యాయం. ఇప్పటికైనా సీతమ్మధారలోనే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.

– రవి, బాలయ్యశాస్త్రి లేఅవుట్

క్లుప్తంగా

యూపీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో



స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రజలు ఎనీమియా బారిన పడకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం స్వతంత్రనగర్, మురళీనగర్, భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన సందర్శించి సమీక్ష నిర్వహించారు. సీజనల్ కమ్యూనికబుల్ డీసీజెస్‌పై సిబ్బంది, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పథకాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం జరగాలని, లేకపోతే ప్రజలు ఇబ్బంది పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోర్ట్ ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ



ఈస్ట్ పార్క్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మద్రిపాలెం: పోర్ట్ ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మురళీనగర్, మాధవధార, ఈస్ట్ పార్క్ ప్రాంతంలో పోర్ట్ యూనియన్ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. విశాఖ ప్రతిష్ట దిగజారేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోర్ట్ హాస్పిటల్‌ను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించడంపై నాయకులు మండిపడ్డారు. ప్రజలంతా ప్రభుత్వాల విధానాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీపరం చేస్తే రానున్న రోజుల్లో యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా పోతాయన్నారు. విశాఖ అభివృద్ధికి పోర్టు కీలకమైందని పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.800 కోట్లు, గతేడాది రూ.386 కోట్ల లాభాలతో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే పోర్టును రక్షించుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రైతుబజార్ కిటకిట



వినియోగదారులతో కిటకిటలాడుతున్న సీతమ్మధార రైతు బజారు

సీతమ్మధార: ఉగాది సందర్భంగా శనివారం ఉదయం నుంచే సీతమ్మధార రైతుబజార్ కిటకిటలాడింది. పువ్వులు, కూరగాయలు, పూజకు కావల్సిన వస్తువుల కొనుగోలుకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఉగాది కోసం పత్రి, పండ్లు, గడ్డి, చెరకు గడలు, మొక్కజొన్న వంటివి కొనుగోలు చేశారు. ఉగాది కావడంతో కొన్ని రకాల పువ్వుల ధరలు పెరిగాయి. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

బహిరంగంగా మద్యం సేవించరాదు



సీతమ్మధారలోని వైన్‌షాపు పరిసరాలను పరిశీలిస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ సీఐ డి.వి.రమణ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీతమ్మధారలోని వైన్ షాపుల నిర్వాహకులను విచారించారు. మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా మద్యం సేవించరాదని సూచించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, రెవెన్యూ క్వార్టర్స్, బిలాల్ కాలనీ, రామాటాకీస్, అశోక్ నగర్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. సీతమ్మధారలోని గాయిత్రి బీర్ అండ్ వైన్స్ నివాసాల మధ్య ఉందని, దీనిపై పోలీస్ కమిషనర్‌తో మాట్లాడతానని అన్నారు. నివాసాల మధ్య వైన్ షాపులు ఉంటే మహిళలు ఇబ్బంది పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న కాలభైరవుడు



ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తెచ్చిన పిండివంటల దండను స్వామికి అలంకరించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతా, క్షీరాభిషేకాలు నిర్వహించారు. భక్తులు గుమ్మిడికాయలో నెయ్యి దీపాలు వెలిగించారు. ఆలయంలో కొలువైన మహాలక్ష్మి దుర్గమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

‘ఆక్సిజన్ టవర్స్‌లోకి డెలివరీ ఇవ్వలేం’

సీతమ్మధార: సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో సమానత్వం చూపిస్తేనే డెలివరీ ఇస్తామని, లేకపోతే ఇవ్వమని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు బి.జగన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆక్సిజన్ టవర్స్ పైకి చెత్తాచెదారం, కుక్కలను తీసుకెళ్లే లిఫ్ట్‌లో డెలివరీ బాయ్స్ వెళ్లాలని నిబంధన పెడుతున్నారని, ఇది వివక్షతో కూడినదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వివక్ష చూపిస్తున్న ఆక్సిజన్ టవర్స్‌లో నివాసులకు తాము డెలివరీ ఇవ్వమని స్పష్టం చేశారు. గౌరవం లేని దగ్గర డెలివరీ ఇవ్వలేమని, ఆక్సిజన్ టవర్స్ వారి అసోసియేషన్ డెలివరీ ఇవ్వండని ప్రెస్ మీట్‌లో చెప్పారని, అటువంటప్పుడు ఈ వివక్ష ఎందుకని ప్రశ్నించారు. మిగతా ఇళ్ల వద్ద డెలివరీ ఇవ్వడానికి ఒక బాయ్‌కి రెండు నుంచి మూడు నిమిషాల సమయం పడుతుందని, ఆక్సిజన్ టవర్స్‌లో మాత్రం కనీసం 45 నిమిషాలు అవుతుందని తెలిపారు. ఒక డెలివరీకి రూ.20 మాత్రమే వస్తుందని, అదనంగా టైం ఇవ్వడమే కాకుండా ఈ వివక్షత తామెందుకు భరించాలని, తామూ డిగ్రీలు, పీజీలు చదువుకున్నామని, ప్రభుత్వం ఉద్యోగం కల్పించకపోవడంతో ఇటువంటి వృత్తి చేస్తున్నామన్నారు. సమానత్వం లేని దగ్గర ఏ విధంగా డెలివరీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వివక్ష లేకుండా చేయాలని కోరారు. కలెక్టర్, పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకొని డెలివరీ బాయ్స్‌ను వివక్షకు గురిచేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు రైతుబజార్ ఆక్రమణల తొలగింపు..

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: ఎట్టకేలకు సీతమ్మధార రైతుబజార్ చుట్టుపక్కల గల పార్కింగ్‌లో లేని వాహనాలకు ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేశారు. ‘అస్తవ్యస్తం’ శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో శనివారం ప్రచురితమైన వార్తకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎన్.వి. ప్రసాద్ పర్యవేక్షణలో ఎంవీపీ ట్రాఫిక్ ఎస్‌ఐ కనకారావు, ఏఎస్‌ఐ గురునాథ్, ఇతర పోలీసు సిబ్బంది సహకారంతో క్లియర్ చేశారు. రైతుబజార్ మూడు వైపులా గల తోపుడుబండ్లను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కనకారావు మాట్లాడుతూ రోడ్డు మీద తోపుడుబండ్ల కారణంగా ట్రాఫిక్‌కి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు తోపుడుబండ్లను వాహనంలో తరలించారు. ‘సాక్షి’ దినపత్రిక వార్తా కథనంతో అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించడం పట్ల స్థానికులు, రైతుబజార్ వినియోగదారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



రైతుబజార్ వద్ద వాహనాలు తొలిగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నైపుణ్యంతోనే ఉత్తమ ఉపాధి అవకాశాలు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ప్రిన్సిపాల్ వెంకటరమణతో ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

మురళీనగర్: అకడమిక్ ప్రమాణాలతోపాటు నైపుణ్యాలు సాధించినప్పుడే ఉత్తమ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జాబ్ అచీవర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు మారుతున్న టెక్నాలజీని నేర్చుకుంటూ సాధికారత సాధించాలని సూచించారు. కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమా విద్యార్థులు నూరు శాతం ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. కాలేజీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా 171 మంది విద్యార్థులకు వారి తల్లిదండ్రులను సన్మానించి ఉద్యోగ నియామక పత్రాలను ఎమ్మెల్యే అందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ వ్యవస్థాపక డైరెక్టర్ వీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ప్రసంగిస్తూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేలా విద్యార్థులు తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్య ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంవీపీ రామకృష్ణ విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రసంగం ద్వారా శుభాకాంక్షలు అందించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ పూర్వ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, వివిధ విభాగాధిపతులు సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డాక్టర్ ఎం.విజయలక్ష్మి, ఏటీపీవో కేవీవీఎస్ఎస్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ నాటకోత్సవాలు

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజులుగా నిర్వహించిన విశాఖ జాతీయ నాటకోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు మలయాళ నాటకం ద టైగర్ మ్యాన్‌ను ముఖ్య అతిథులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ మహాకవి గురజాడ రాసిన కన్యాశుల్కం సమాజాన్ని జాగృతం చేసిందన్నారు. కళలు, నాటకాలను ప్రోత్సహించడానికి రైటర్స్ అకాడమీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ విశాఖలో జాతీయ నాటకోత్సవాలు నిర్వహించి, సామాజిక సమస్యలపై స్పందించడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, రఘురామ కృష్ణంరాజులు నటనతో మెప్పించి కళల ప్రాధాన్యాన్ని తెలియజేశారన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, ప్రముఖులు నాంచారయ్య, చలసాని కృష్ణప్రసాద్, ఫణి స్వామి, కె.వెంకటేశ్వరరావు, మేడ మస్తాన్‌రెడ్డి, ఆడిటర్ ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



టైగర్ మ్యాన్ నాటకంలోని ఓ సన్నివేశం

ఆలోచింపజేసిన ‘ద టైగర్ మ్యాన్’

కేరళకు చెందిన మలయాళ దర్శకులు హిస్నం టోంబో దర్శకత్వం వహించిన ‘ద టైగర్ మ్యాన్’ నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. గిరిజన గ్రామాల్లోని ప్రజల జీవనాన్ని, పేదరికాన్ని కళ్లకు కట్టినట్లు నటీనటులు ప్రదర్శించారు. 32 మంది కళాకారులు చక్కగా నటించి ప్రేక్షకులను కంటతడి పెట్టించారు.

- లీడర్ జాతీయ నాటకోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం కళాభారతి వేదికపై చిన్నారి రియాన్స్ ప్రహ్లాదుని ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సెకండ్ క్లాస్ చదువుతున్న ఏడేళ్ల రియాన్స్ భక్త ప్రహ్లాదుడి పాత్రలో ఓం నమో నారాయణ అంటూ ఆలపించిన గానం నాటి భక్తప్రహ్లాద చిత్రాన్ని గుర్తుచేసింది.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- గంజాయి బ్యాచ్ పనే అని అనుమానం



కాలి బూడిదైన ద్విచక్ర వాహనాలు

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి, సింగ్‌హోటల్ జంక్షన్‌లో శనివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.8లక్షల విలువ గల 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. టూటౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌హోటల్ జంక్షన్‌లో గల ఒక గ్రూపు హౌస్‌లో శనివారం తెల్లవారు జాము 4.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. దీంతో స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవటంతో ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి కారణమైన వారు గంజాయి బ్యాచ్ కావచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ తెలిపిన వివరాలిలా.. కడపకు చెందిన సురేష్‌రెడ్డి అదే ప్రాంతానికి చెందిన నాగేశ్వరరెడ్డికి అల్లూరి జిల్లాలోని కొయ్యూరుకు చెందిన నరేంద్ర ద్వారా నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి సురేష్‌రెడ్డి వద్దకు చేర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో గంజాయితో ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గల తాజ్ హోటల్‌లో ఉన్నట్లు సమాచారంతో ద్వారకా సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో సిబ్బంది తనిఖీలు చేశారు. బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సత్తివాడకు కవిబ్రహ్మ పురస్కార ప్రదానం

డాబాగార్డెన్స్: ప్రతిభ సాంస్కృతిక, క్రీడా, స్వచ్ఛంద సేవా సంస్థ, మదర్ థెరీసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ప్రత్యేక ఉగాది వేడుకల్లో నగరానికి చెందిన ప్రముఖ కవి సత్తివాడ శ్రీకాంత్‌కు కవిబ్రహ్మ, ఆణిముత్యం ఉగాది జీవిత సాఫల్య పురస్కారాలు అందజేశాయి. సత్కారం కింద బంగారు మెడల్, జ్ఞాపికతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు కె. కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజాన్ని చైతన్య పరుస్తున్నందుకు సత్తివాడకు ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు. ప్రొఫెసర్ సూరంపూడి మాస్టర్, ఏయూ ప్రొఫెసర్ రాజు, మెడికవర్ వైద్యుడు డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎంవీపీకాలనీ: ఫిషింగ్ హార్బర్‌కు చెందిన పిల్లా నూకమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పిల్లా పైడిరాజు(24) చేపల వేటకు వెళ్తుంటాడు. ఈ నెల 28న భీమిలిలో నూకాలమ్మ పండగ సందర్భంగా పైడిరాజు, అతడి స్నేహితుడు పిల్లా చంటితో కలిసి అక్కడికి వెళ్లాడు. రాత్రంతా సరదాగా గడిపి భీమిలి నుంచి బైక్‌పై వస్తుండగా.. 29వ తేదీ తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో వెంకోజీపాలెం ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో హైవేపై డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ సమయంలో చంటి వాహనం నడుపుతుండగా పైడిరాజు వెనుక కూర్చున్నాడు. నిర్లక్ష్యంగా వాహనం నడపడం, అతివేగంగా కారణంగా డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పైడిరాజు అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రగాయాలైన చంటిని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనలో ఏపీ39ఆర్‌జీ 5980 యమహా ఎంటీ బైక్ నుజ్జునుజ్జయ్యింది. ప్రస్తుతం చంటి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ‘ఉత్తర’ ఉద్యోగులు, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా మాటూరి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా మాటూరి వీరరాఘవులు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు.ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

టి.ఎస్.ఎన్.మూర్తికి డాక్టరేట్



టి.ఎస్.ఎన్.మూర్తి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తికి వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్(న్యూఢిల్లీ) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శనివారం మూర్తి మాట్లాడుతూ 35 ఏళ్లుగా వివిధ ఆర్గనైజేషన్ల ద్వారా తాను చేసిన సోషల్ సర్వీస్‌కు గుర్తింపుగా డాక్టరేట్ ప్రదానం చేశారని తెలిపారు. కమిషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.